క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఇబ్రహీంపట్నం: ఆదిభట్ల సబ్‌స్టేషన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్, మరియపురం ఫీడర్లలో.. విద్యుత్ తీగలకు తగిలే చెట్లకొమ్మలను తొలగించనున్న కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సోమవారం ఏఈ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మరియపురం గృహ, టీసీఎస్ పరిసర ప్రాంత గృహ, వాణిజ్య, ఇండస్ట్రియల్ వినియోగదారులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేతరి దర్శన్‌కు అధ్యక్ష పదవి ఇవ్వండి

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మేతరి దర్శన్‌ను నియమించాలని కోరుతూ పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి పనిచేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా న్యాయం జరుగుతుందని అన్నారు. కౌన్సిలర్లు కాకుమాను సునీల్, కంబాలపల్లి ధన్‌రాజ్, శివలింగం గౌడ్, బాల్‌రాజ్, నాయకులు ధన్‌రాజ్ గౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ మండప నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: బోయినుగుట్ట హనుమాన్ ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయం అందిస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడ్తాల్ మండలం చరికొండ గ్రామ పంచాయతీ పరిధిలోని బోయిన్‌గుట్ట హనుమాన్ ఆలయ ఆవరణలో శ్రీ సీతారాముల కల్యాణ మండప నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, నాయకులు భీష్మాచారి, అంజినాయక్, రాజు, సుమన్‌నాయక్, సతీశ్, పవన్, మల్లేశ్ ఉన్నారు.

కాంగ్రెస్ మండల సేవాదళ్ అధ్యక్షుడిగా దశరథం


నియామకపత్రం అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

తలకొండపల్లి: కాంగ్రెస్ మండల సేవాదళ్ అధ్యక్షుడిగా కానుగుల దశరథం ఎన్నికయ్యారు. ఈ మేరకు సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి హైదరాబాద్ గాంధీభవన్‌లో మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్‌కు చెందిన దశరథం గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశాడు. ఆయన సేవలను గుర్తించి సేవాదళ్ అధ్యక్షుడిగా నియమించినట్లు వెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, మహేష్, లక్ష్మయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని స్వాతి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో మంగళవారం సోమాజీగూడ యశోద హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శిబిరాన్ని స్వాతి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డా.రాందాస్ నాయక్ ప్రారంభించారు. శిబిరంలో యశోదా హాస్పిటల్ ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 80 మందికి ఉచితంగా ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించారు. మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కుమార్, డాక్టర్లు సాయిలత, దశరథ్, రాందాస్, సిబ్బంది యాదగిరి, శేఖర్ పాల్గొన్నారు.

హాత్ సే హాత్ జోడో కరపత్రాల ఆవిష్కరణ

తలకొండపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి విమర్శించారు. హాత్ సే హాత్ జోడో యాత్ర కరపత్రాన్ని ఆయన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్తా, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ అజీం, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కన్వీనర్ రవీందర్‌యాదవ్, చెన్న కేశవులు, కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడు దశరథం తదితరులు పాల్గొన్నారు.

345 మందికి కంటి పరీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని లింగరావుపల్లి, వెల్జాల్‌లో మంగళవారం నిర్వహించిన కంటివెలుగు శిబిరంలో 345 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సైదమ్మ, కల్పన, రామకృష్ణ, మల్లికార్జున్, హెచ్ఏ మల్లయ్య, రామచంద్రయ్య, శివకుమార్, రవికుమార్, మాధవి, స్వాతి, నాగమల్లీశ్వరి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అన్ని హంగులతో పీఏసీఎస్ భవనం

- యాచారం నూతన పీఏసీఎస్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు
- ఎరువులు, విత్తనాలు, యంత్ర సామగ్రి అన్నీ ఒకేచోట అందించేలా ఏర్పాట్లు


యాచారం పీఏసీఎస్ పాత భవనం

యాచారం: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పాత భవనాన్ని కూల్చివేసి నూతన భవన నిర్మాణం చేయనున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాన్ని కూల్చేసి విశాలమైన గదులు, అన్ని సౌకర్యాలతో కూడిన భవనాన్ని నిర్మించే విధంగా యాచారం పీఏసీఎస్ నిర్ణయించింది. ఈ భవనం నిర్మాణం కోసం ఆరు నెలల కింద పీఏసీఎస్ పాలకవర్గం కావాల్సిన నిధుల మంజూరు కోసం డీసీసీబీకి ప్రతిపాదనలు పంపింది. ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న డీసీసీబీ పాత భవనాన్ని కూల్చేసి నూతన భవనం నిర్మించడానికి రూ.52 లక్షల నిధులను మంజూరు చేసింది. మంజూరైన నిధులతో త్వరలో నూతన భవనాన్ని నిర్మించేలా సోమవారం పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన పాలకవర్గం సమావేశమై తీర్మానం చేసి టెండర్‌కు నిర్ణయించింది. డీసీసీబీ మంజూరు చేసిన రూ.52 లక్షల నిధులతో పాటు పీఏసీఎస్ లాభాల నుంచి రూ.10 లక్షలు అదనంగా కేటాయించి నూతన భవనాన్ని నిర్మించడానికి నిర్ణయించారు.

అన్నీ ఒకేచోట లభించేలా..

ఇన్నాళ్లు యాచారం పీఏసీఎస్‌లో కేవలం వరి విత్తనాలు, కొన్ని రకాల ఎరువులను మాత్రమే విక్రయిస్తున్నారు. ప్రతి యేటా రూ.30 లక్షలు ఖర్చు చేస్తూ ఎరువులు, విత్తనాలు రైతులకు అందిస్తున్నారు. నూతన భవన నిర్మాణం జరిగితే అన్నిరకాల ఎరువులు, విత్తనాలు, పెస్టిసైడ్స్ కూడా అందుబాటులో ఉంచనున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో అత్యధికంగా రైతులు వరి పంటతో పాటు పలురకాల కూరగాయల పంటలు, ఆకుకూరలు సాగు చేస్తారు. పీఏసీఎస్‌లో గ్రోమోర్, యూరియా తదితర ఎరువు మందులను కొనుగోలు చేస్తున్న రైతులు పురుగు మందులను ఇతర ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇకనుంచి పత్తి విత్తనాలతో పాటు అన్నిరకాల ఎరువులు, విత్తనాలు, పెస్టిసైడ్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు. అదేవిధంగా వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికరాలు, ఇతర సామగ్రిని నిల్వ ఉంచనున్నారు. రైతుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు ఒకేచోట లభించేలా సమకూర్చనున్నారు.

మంచి లాభాలు వచ్చేలా...

యాచారం పీఏసీఎస్‌లో మొత్తం 7,328 మంది సభ్యులు ఉన్నారు. అందులో 2,130 మంది రైతులు రూ.48 కోట్ల దీర్ఘకాలిక, రూ.11 కోట్ల స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. ప్రతిఏటా రూ.30 లక్షల నిధులు ఖర్చుచేసి రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారు. అదే విధంగా ప్రతి ఏటా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. సంఘంలోని సభ్యు(రైతు)లు వ్యవసాయ పంటల సాగులో అవసరమయ్యే యంత్ర పరికరాలు, సామగ్రి, ఎరువులు, విత్తనాలు నిల్వఉంచి మంచి లాభాలు వచ్చే విధంగా కృషిచేస్తున్నారు. యాచారం పీఏసీఎస్ జిల్లాలోనే రూ.60 నుంచి రూ.75 కోట్ల లావాదేవీలు సాగిస్తుంది. అన్నిరకాల సేవలు అందిస్తే రూ.వంద కోట్ల లావాదేవీలు జరిపే అవకాశం ఉంది.

మార్కెట్లో కొనుగోలు చేస్తున్నాం



మా గ్రామంలో పుదీనా పంట సాగుతో పలురకాల పురుగు మందులు అవసరం ఉంటాయి. రైతులకు పీఏసీఎస్‌లోనే అన్నిరకాల ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు లభించవు. కేవలం కొన్నిరకాల విత్తనాలు, ఎరువులు లభించడం వల్ల ఇబ్రహీంపట్నం, మాల్ మార్కెట్లకు వెళ్లి పెస్టిసైడ్స్ కొనుగోలు చేయాల్సి వస్తుంది. మరొకొన్ని నగరంలోని మాదన్నపేట మార్కెట్లో కొనుగోలు చేస్తున్నాం. అన్నీ ఒకేచోట స్థానికంగా లభిస్తే సౌకర్యవంతంగా ఉంటుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– యాదగిరిరెడ్డి, రైతు, మొండిగౌరెల్లి

గ్రామాల్లో కౌంటర్లు పెట్టాలి



యాచారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోనే అన్నిరకాల ఎరువులు, విత్తనాలు లభించడం మంచిదే. కాని దూరంలో ఉన్న గ్రామాల నుంచి రైతులు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్లడం కష్టంగా ఉంటుంది. నక్కర్తమేడిపల్లి, మాల్, గునుగల్, చింతుల్ల తదితర మేజర్ గ్రామాల్లో కౌంటర్లు పెట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదనలు చేశాం. ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

– మల్లారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్, నందివనపర్తి

రైతు ప్రయోజనాలే ముఖ్యం



సంఘానికి లాభాల కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యం. డీసీసీబీ మంజూరు చేసిన రూ. 52 లక్షల నిధులతో నూతన భవనాన్ని నిర్మించి అన్నిరకాల ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, యంత్ర పరికరాలు అందులో ఉంచేలా కృషి చేస్తున్నాం. సంఘంలో సభ్యులుగా ఉన్న ప్రతి రైతు కొనుగోలు చేసేలా అవసరమైతే రాయితీలు ప్రకటిస్తాం. రైతుకు కావాల్సినవి పీఏసీఎస్‌లోనే ఒకేచోట లభించేలా చూస్తున్నాం.

– రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, యాచారం

ఆర్టీసీ సేవలపై కళాజాత బృందం అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

కడ్తాల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని మంగళవారం మండల పరిధిలోని మక్తమాధారం, రావిచేడ్ గ్రామాల్లో ఆర్టీసీ కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. విద్యార్థులకు రాయితీతో కూడిన ఉచిత బస్ పాస్ సౌకర్యం, దివ్యాంగులకు అందిస్తున్న బస్‌పాస్ సౌకర్యాలతో పాటు కార్గో పార్సిల్స్, కొరియర్ సేవలను వివరించారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లే ప్రయాణికులకు టీఎస్ ఆర్టీసీ కల్పించే సౌకర్యాలపై రాయితీలపై పాటల రూపంలో వినిపించారు. ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహేశ్వరం ఆర్టీసీ సిబ్బంది, కళాజాత బృందం సభ్యులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన జయమ్మ (54) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, సర్పంచ్ హైమావతి, నాయకులు.. రామస్వామి, ఎండీ.ఆరీఫ్, లక్ష్మీనారాయణ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సత్యంగౌడ్, యాదయ్య, తిరుపతయ్య, భగవంత్, రామస్వామి, శ్రీశైలం, శాంతయ్య, గౌరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి


ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు నేతల వినతి

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం నిధులు మంజూర్ చేయాలని ఆ గ్రామ ఉప సర్పంచ్ రాజమోని తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి స్థానిక నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామ పంచాయతీ భవనం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నామన్నారు. దీంతో గ్రామ పంచాయతీ సమావేశాలు నిర్వహించాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుపతి, వార్డుసభ్యులు రవి, గణేష్, మహేష్, దేవేందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి


శివకు చెక్కు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

తలకొండపల్లి: ప్రతిభ గల క్రీడాకారులను ఐక్యతా ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటామని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గడ్డమీదితండాకు చెందిన జర్పుల శివ క్రికెట్ ట్రెనింగ్ కోసం సహాయం చేయాలని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని ఆశ్రయించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు అండగా ఉంటామన్నారు.మంగళవారం వరప్రసాద్‌రెడ్డి ఆమనగల్లులో శివకు రూ. 25,000 అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్, భరత్, శివా, విజయ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


తలకొండపల్లి: రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వీరన్నపల్లిలో సీసీరోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ నాగమణి లింగంగౌడ్ సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో మంజూరైన రూ.8 లక్షల ఉపాధి నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపడతున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండల్ కార్యదర్శి జంగయ్య, లింగంగౌడ్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

అందుగులలో..

మాడ్గుల: అందుగుల గ్రామ పంచాయతీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని సర్పంచ్ జయలక్ష్మీరాజు అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో గ్రామంలో అన్ని వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. మండలంలోని అందుగులలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం సర్పంచ్, పాలకవర్గం సభ్యులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రమేశ్, అలివేలు, వెంకటయ్య, శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ ఖాజామియా, సత్తయ్య, శ్రీనాథ్, నారయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌కుమార్‌రెడ్డి వెన్నంటే..

పాదయాత్రలో కీలకంగా బంటి యూత్ ఫోర్స్ సభ్యులు


ప్రశాంత్‌కుమార్‌రెడ్డితో బంటి యూత్‌ఫోర్స్ సభ్యులు

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్రలో బంటి యూత్ ఫోర్స్ సభ్యులు అతని వెన్నంటి ఉంటున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు జెర్కొని రాజు ఆధ్వర్యంలో ఈ ఫోర్స్ ముందుకు వెళ్తుంది. యాచారం మండలం నందివనపర్తి నుంచి గత నెల 22న మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ప్రగతి నివేదన పాదయాత్ర ప్రారంభమయ్యింది. అప్పటినుంచి ఇప్పటి వరకు 330 కిలోమీటర్ల పాదయాత్రలో అతనితోపాటే బంటి యూత్ ఫోర్స్ సభ్యులు పయనిస్తున్నారు. ప్రశాంత్‌రెడ్డి అడుగులో అడుగువేస్తూ ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వారు కూడా వివరిస్తున్నారు. యాచారం, మంచాల మండలాలల్లో ఈ పాదయాత్ర పూర్తిచేసుకొని ఇబ్రహీంపట్నం మండలంలో ప్రస్తుతం ఈ పాదయాత్ర కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

పుల్వామా అమరవీరులకు నివాళి


ఆమనగల్లు: ఏబీవీపీ ఆధ్వర్యంలో..


మాడ్గుల: బ్రాహ్మణపల్లిలో విద్యార్థుల ర్యాలీ

ఆమనగల్లు: పుల్వామాలో అమరులైన వీరజవాన్లకు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నివాళులు అర్పించారు. కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పుల్వామా అమరవీరుల చిత్రపటాలకు ఆమనగల్లు సీఐ జాల ఉపేందర్, ఏబీవీపీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కళాశాల అధ్యాపకులు శ్రీను, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి, ఏబీవీపీ నగర కార్యదర్శి శివ, నాయకులు భరత్, లండం మల్లేశ్, సాయి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ..

మాడ్గుల: శ్రీనగర్‌లోని పుల్వామాలో భారత జవాన్లపై ఉగ్రవాదుల దాడి ఘటన హేయమైన చర్య అని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మంగళవారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగ్రదాడిలో వీరమరణం పొందిన జవాన్లకు కొవ్వొత్తులతో సంతాపం తెలిపారు. స్థానిక మాజీ జవాన్లు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, యువత కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు రూ.1.50 లక్షల విలువ కల్గిన టీషర్టులు, క్యాపులు, ఇతర సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మయ్య, మాజీ జవాన్లు తిరుపతయ్య, యాదయ్య, ఐక్యత ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: పూల్వామాలో జరిగిన ముష్కరుల దాడిలో అమరులైన వీరజవాన్లకు అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి స్థానిక యువకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అంతకుముందు వీధుల్లో వీరజవాన్ల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలతో ర్యాలీ నిర్వహించారు.

ఎన్ఐఆర్‌డీ శిక్షణ సదస్సులో సర్పంచ్

కడ్తాల్: హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఎక్స్‌టెన్షన్ శిక్షణ కేంద్రంలో తెలంగాణ గ్రామీణాభివృద్ధి–పంచాయితీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 'గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరుల సమీకరణ' అనే అంశంపై జిల్లా నుంచి ఎంపికైన సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శులకు 5 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శిక్షణ కార్యక్రమానికి కడ్తాల్ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రెనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ రాఘవేందర్, ట్రెనర్లు భగవాన్‌రెడ్డి, సాధన, చిన్నదురై, ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరుల పెంపు, నిధుల సమీకరణ తదితర అంశాలపై సమగ్రంగా విశదీకరించారని, గ్రామ పంచాయతీల బలోపేతానికి చేపట్టవలసిన కార్యక్రమాలపై వివరించారని సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. అధికారులు ఇచ్చిన సూచనలు, సలహాలు పంచాయతీల సమగ్రాభివృద్ధికి దోహదపడుతాయని ఆయన తెలిపారు. వారి సలహాలను గ్రామాభివృద్ధిలో పాటిస్తామన్నారు.



తెలంగాణలో అధికారంలోకి వస్తాం: బీజేపీ నేత ఆచారి

ఆమనగల్లు: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి అన్నారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలో జరిగిన శక్తికేంద్రం సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆచారి హాజరయ్యారు. ఆచారి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సర్కార్ ప్రజాసమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.ఈ సందర్భంగా పలువురు బీజేపీలో చేరారు. సమావేశంలో కల్వకుర్తి బీ జేపీ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు హరిప్రసాద్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బీజేపీ నాయకులు వెంకటేశ్, పెద్దయ్యయాదవ్, ప్రభాకర్, శ్రీను పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరంలో వెలసిన శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి 22 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏటా మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు ఏడు రోజుల పాటు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా వారం రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ కరుణాకర్ రెడ్డి, రాంనుంతల సర్పంచ్ సోన శ్రీనునాయక్, కోనాపూర్ సర్పంచ్ మల్లమ్మ, ఎంపీటీసీ సరిత పంతునాయక్ కోరారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

తుర్కయంజాల్: విద్యార్థులు బాల్యం నుంచి శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలని కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ సిల్మానాయక్ తెలిపారు. మంగళవారం పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ నిర్వాహకులు మహిపాల్ కరంటోత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో 20 పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఆర్డీఓ వెంకటాచారి


మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటాచారి

తుర్కయంజాల్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఇ.వెంకటాచారి తెలిపారు. మంగళవారం రాగన్నగూడలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిలపక్షం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో మొత్తం 6 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా, హయత్‌నగర్ మండలంలో 890 మంది ఓటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 830 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 800 కంటే అదనంగా ఓటర్లు ఉన్నచోట మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే ఆలోచన ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకుల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు.

బహిరంగ సభకు తరలిరండి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రగతి నివేదనయాత్రను పురస్కరించుకోని 19వ తేదీన ఇబ్రహీంపట్నంలో నిర్వహించే బహిరంగసభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆపార్టీ మున్సిపల్ అధ్యక్షులు అల్వాల వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శేరిగూడలో ఏఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన అనంతరం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలియజేసేందుకు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించే సభకు సుమారు 3వేల మందికి పైగా పార్టీ శ్రేణులు, పార్టీ అభిమానులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, సింగిల్‌విండో చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ శంకర్, రైతుబంధు సమితి మండల అధ్యక్షులు మొద్దు అంజిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ భరత్‌కుమార్, కౌన్సిలర్లు సుల్తాన్, జగన్, బాలరాజ్, మంద సుధాకర్, మార్కెట్ కమిటీ సభ్యులు కిరణ్, ఆ పార్టీ నాయకులు వేణుగోపాల్‌రావు, మహేశ్‌గౌడ్, నల్లబోలు శ్రీనివాస్‌రెడ్డి, ముజకిర్, మధుకర్‌రెడ్డి, రవి, బర్ల జగదీశ్‌లు పాల్గొన్నారు.